
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 4 అక్టోబరు 2024



- సర్కారు ఖర్చుతో విద్యార్థులకు ఎక్స్‌కర్షన్
- తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శన
- స్థానిక పర్యాటక ప్రాంతాలకు ప్రాధాన్యం
- పాఠశాలల్లో టూరిజం క్లబ్‌లు
- ఒక్కో క్లబ్‌లో 25 మంది విద్యార్థులు
- జిల్లాలో 535 పాఠశాలలు, 52,109 మంది విద్యార్థులు
- ఇంటర్, డిగ్రీల్లో 10 వేల మంది విద్యార్థులు



మిడ్ మానేరు ప్రాజెక్ట్



వినోదం విజ్ఞానం



వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

'ఎక్స్‌కర్షన్' చాలా రోజుల తరువాత ఈ మాట వింటుంటే అందరికీ పాత రోజులు గుర్తుకొస్తాయి. పిల్లలను ఎక్స్‌కర్షన్‌లకు పంపించడం.. విద్యార్థులు కూడా ఉత్సాహంగా వెళ్లడా నికి ఇష్టపడడం కనపించేది. ప్రభుత్వ పాఠశాలల్లో మళ్లీ చాలా రోజుల తరువాత విద్యార్థులకు విద్య, వైజ్ఞానిక విహార యాత్రలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. తెలంగాణ దర్శిని పేరిట పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం ఇస్తుంది. ప్రభుత్వమే విహారయాత్రలకు అయ్యే ఖర్చులు భరించనుంది. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ స్థాయి విద్యార్థుల వరకు విహార యాత్రలకు అవకాశం కలగనుంది. విద్యార్థుల్లో మానసికోల్లాసం లేకుండా పోతోం దని భావించి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 535 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠ శాలలు ఉండగా 52,109 వరకు విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు కలిపి పదివేల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. విద్యా ర్థులకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం, మిడ్ మానేరు ప్రాజెక్ట్, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, అర్బన్ పార్కులు, ఉమ్మడి జిల్లాలోని ధర్మపురి, కాళేశ్వరం, ఎలగందల్ కోట, ఎల్ఎండీ ప్రాజెక్ట్, సింగరేణి, రామగుండం, వంటి ప్రాంతాలు సందర్శించే అవకాశం ఉంది. పొరుగు జిల్లాలోని బాసర, అలీసాగర్, బోటానికల్ గార్డెన్, కోమటి చెరువ వంటి ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉంది.

● విహార యాత్రలకు వెళ్లేందుకు..

విద్యార్థులు విహార యాత్రలకు వెళ్లేందుకు ప్రభుత్వం విధి, విధానాలను రూపొందిస్తోంది. 2, 3, 4, తరగతులకు సంబంధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.300 ఖర్చు చేస్తారు. ఒక్కరోజు మాత్రమే అదే గ్రామం, మండల స్థాయిలో పర్యాటక ప్రాంతాలు చూపిస్తారు. 5, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు ఒక్క రోజు 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు ఒకే రోజు తీసుకెళ్లి తీసుకొస్తారు. వీరికి ఒక్కో విద్యార్థికి రూ.800 ఖర్చు చేస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు రెండు రోజులు 50నుంచి 70 కిలో మీటర్ల దూరంలోని ప్రాంతాలకు వెళ్తారు. విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు ఖర్చు చేస్తారు. డిగ్రీ పీజీ విద్యార్థులకు నాలుగు రోజుల పర్యటనలో రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా తీసుకెళ్తారు. విద్యార్థికి నాలుగు వేల రూపాయల చొప్పున ఖర్చు చేయనున్నారు.

● పెరగనున్న ఉపాధి అవకాశాలు

తెలంగాణ దర్శిని పేరిట ప్రభుత్వం ప్రారంభించనున్న విద్యార్థుల టూరిజం ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసం, విజ్ఞానం, పెరగడంతో పాటు స్థానికంగా ఉండే వారికి ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. విద్యార్థులు సందర్శించే టూరిజం ప్రాంతాల్లో హోటళ్లు, ఇతర ఆట వస్తువుల వ్యాపారాలు పెరగనున్నాయి. పర్యాటకశాఖ లోకల్ గైడ్‌లను కూడా నియమించడం ద్వారా యువతకు కూడా ఉపాధి లభిస్తుంది. సెలవు రోజుల్లో పర్యటన చేపట్టే దిశగా ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు.

● యువ టూరిజం క్లబ్‌లు

తెలంగాణ సంస్కృతీసంప్రాదాయాలు విభిన్నమైన భౌగోళిక పరిస్థితులతో ఉంటుంది. పర్యాటకం, పర్యావరణం, ప్రకృతి వనరులకు కొదవలేదు. పాఠశాలల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం యువ టూరిజం క్లబ్‌లను కూడా ఏర్పాటు చేయనుంది. ఏడో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే విద్యార్థులకు టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతీ క్లబ్‌లో 25మంది విద్యార్థులను సభ్యులుగా ఏర్పాటు చేస్తారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తూ మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే లక్ష్యంగా క్లబ్‌లు పనిచేసే విధంగా చూస్తారు. క్లబ్‌ల ద్వారా విద్యార్థిస్థాయి నుంచే సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు. టూరిజం క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు పర్యాటక ఊతమే కాకుండా మానసికోల్లాసం కలగనుంది.



బొప్పాపూర్ పీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3ష: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కాయకల్ప అవార్డుకు ఎంపికైందని జిల్లా వైద్యాధికారి వసంతరావు, మండల ఇన్‌చార్జి వైద్యాధికారి స్రవంతి గురువారం తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది పని తీరు, విద్యుత్ వినియోగం, తదితర అంశాలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసిందని పేర్కొన్నారు. అవార్డు కింద రూ.2లక్షలు హెల్త్ వెల్ నెస్ సెంటర్‌కు అందించనుందని తెలిపారు. అవార్డు రావడంపై సిబ్బందిని జిల్లా, మండల వైద్యాధికారులను డీఎంహెచ్‌వో వసంతరావు అభినందించారు.

భవిష్యత్‌లో మరింత ప్రతిభ కనబర్చాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 3: వైద్య విద్య చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో మరింత అత్యుత్తమ ప్రతిభను కనబర్చాలని సిరిసిల్ల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భైరి లక్ష్మీనారాయణ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌లో ఉన్న మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వ విద్యాలయం 2024లో నిర్వహించిన ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షల్లో రాష్ట్రంలోనే సిరిసిల్ల కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని అన్నారు. ఈ ఫలితాల్లో ప్రధానంగా ఓవరాల్ డిస్టింక్షన్‌లో 75 శాతంపైన మార్కులను అర్జున్ గెహ్లోత్, కౌశికి కేసరవాణి, కౌశిక్ వర్మ సాధించారన్నారు. బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో తొమ్మిది మంది విద్యార్థులు, అనాటమీ సబ్జెక్ట్‌లో ముగ్గురు విద్యార్థులు, ఫిజియాలజీ సబ్జెక్ట్‌లో ముగ్గురు, మొత్తం 15 మంది ఉత్తీర్ణ సాధించిన సందర్భంగా గురువారం వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. భవిష్యత్తులో సిరిసిల్ల వైద్య కళాశాలకు మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ కోరారు.

అల్పాహారం వితరణ

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3: దేవి శరన్నరాత్రులను పురస్కరించుకొని గాంధీనగర్‌లోని ఓ కిరాణం యజమాని ప్రతిరోజు భక్తులకు, పేద ప్రజలకు ఉచితంగా అల్పాహారం వితరణ చేయగా వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, కిరానం యజమాని పీసు మల్లారెడ్డి, బొందుగుల మహేశ్వర్, పోల రజనీకాంత్, స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

దసరాలోగా టీచర్ల నియామకం పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 3: దసరా పండుగలోగా టీచర్ల నియామకం పూర్తి చేయాలని, పక్కా ప్రణాళికతో ధాన్యం కొనుగోల్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి అవసరమైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి సీరియల్ నంబర్‌ను ఏర్పాటు చేసి రైస్‌మిల్లులకు తరలించే ధాన్యం బస్తాలపై కేంద్రాల నంబర్లను వేయాలని సూచించారు. సన్నరకం, దొడ్డురకం కొనుగోలుకు వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి గన్నీ బ్యాగులను అందుబాటులోకి ఉంచుకోవాలని అన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 నిష్పత్తి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశామని దసరా పండుగలోగా సర్టిఫికేట్ల పరిశీలన పూర్తి చేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇవ్వాలని సూచించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధింత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వార్త పత్రికల్లో వచ్చే వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేసి కొనుగోలు కేంద్రాల్లో సన్నబియ్యం, దొడ్డుబియ్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్నరకం ధాన్యం వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతు సాగు చేసిన భూమిని పరిశీలించి పండించిన సన్నరకం దిగుబడి వివరాలను ధ్రువీకరించాలని అన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ శేషాద్రి, వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మీ, డీటీవో లక్ష్మణ్, డీఈవో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● సీడీపీ పనులు త్వరగా చేపట్టాలి

జిల్లాలో చేపట్టిన సీడీపీ(నియోజకవర్గ అభివృద్ధి పనులు) త్వరగా చేపట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం సీడీపీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి నిధుల పనులకు సంబంధించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ద్వారా పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. వీటిని పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, విద్యాశాఖ , మున్సిపల్ శాఖలతోపాటు 18 ఏజెన్సీలకు కేటాయించడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో పనులు పూర్తయినప్పటికి యూసీ(యుటిలైజేషన్ సర్టిఫికేట్)లు సమర్పించకపోవడంతో ప్రభుత్వ రికార్డుల్లో పనులు పూర్తి కానట్లు ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి చేసిన పనులకు సంబంధించి యూసీలను విద్యాశాఖ అధికారి, ఏరియా ఆసుపత్రి అధికారి, సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్థుత స్థితిగుతులపై సంబంధింత శాఖలు నివేదికలను సమర్పించాలన్నారు. సమీక్షా సమావేశంలో సీపీవో శ్రీనివాసచారి, పీఆర్ ఈఈ భూమేష్, ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

రాజన్న ఆలయంలో బతుకమ్మ వేడుకలు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో బతుకమ్మ వేడుకలు గురువారం కొనసాగాయి. రాజన్న ఆలయంలో రెండో రోజు అటుకుల బతుకమ్మను మహిళలు వైభవంగా నిర్వహించారు. పట్టణ వాసులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమ జ్జనం చేసి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని పరామర్శించిన ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబరు 3: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి పురుషోత్తం రెడ్డి ఇటీవల మరణించగా గురువారం నాడు ఆది శ్రీనివాస్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నివాసానికి వెళ్లి పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పురుషోత్తంరెడ్డి మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు.

వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



ఆశ్రమ నిర్వాహకులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

సిరిసిల్ల అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా అమల్లోకి తెచ్చిందని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. గురువారం సిరిసిల్ల కలెక్టరేట్‌లో స్త్రీ శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు, వృద్ధుల ఆశ్రమాలను నిర్వహిస్తున్న వారికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో వయోవృద్ధుల ఆశ్రమాల్లో ఉన్నవారికి చెస్, క్యారమ్, లుడో ఆటల పరికరాలు, టీవీ, డీటీహెచ్ సౌకర్యాలు అందుబాటులో ఉంచామని అన్నారు. తీర్థయాత్రలు, విహారయాత్రలు, సినిమాలకు తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ప్రభుత్వం తీసుకవచ్చిందని 14567 టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రవేశపెట్టిందని వయో వృద్ధులు ఇబ్బందులు ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావు, ఏఎస్పీ చంద్రయ్య, ప్రైవేట్ ఆశ్రమాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరాలు ప్రతీ రోజు అందించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 3: ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను ప్రతీ రోజు అందించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఎల్అర్ఎస్ దరఖాస్తులు పెండింగ్ పరిష్కారం తదితర అంశాలపై సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, తమ పరిధిలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయే వివరాలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువు విధించి త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, డీఎల్పీవో గీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జేఏసీ ఉద్యమకారులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3: జిల్లా ఉద్యమ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద రాజన్న సిరిసిల్ల జిల్లా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆవిర్భావ వేడుకల్లో భాగంగా జిల్లా ఉద్యమ జేఏసీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను సాధించుకొని నేటికి ఏడు సంవత్సరాలు పూర్తిచేసుకొని ఎనిమిది సంవత్సరాల్లోకి అడుగుపెట్టడం జరిగిందన్నారు. జిల్లా ఉద్యమ జేఏసీ నాయకులపై నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో కేసులను పెట్టారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వెంటనే కేసులను ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు కాముని వనిత, సంగీతం శ్రీనివాస్, జలగం ప్రవీణ్‌కుమార్, ఎండీ సత్తార్, భైరవేని రాము, ఆకునూరి బాలరాజు, చొక్కాల రాము, చెక్కిల్ల మహేష్‌గౌడ్, సోమిశెట్టి దశరథం, రిక్కుమల్లె మనోజ్, కంసాల మల్లేశం, రాగుల రాములు, బుస్సు వేణు, లింగంపల్లి సత్యనారాయణ, లింగంపల్లి మధూకర్, అన్నల్‌దాస్ భాను పాల్గొన్నారు.

డిజిటల్ కార్డు కోసం కుటుంబ సర్వే: ఆర్డీవో

వేములవాడ, అక్టోబరు 3: కుటుంబాల వారీగా డిజిటల్ కార్డు అందజేసే ప్రక్రియలో భాగంగా వేములవాడ పట్టణంలోని 19వ వార్డు పరిధిలో గల గాంధీనగర్‌లో డిజిటల్ సర్వేను ప్రారంభించామని నోడల్ అధికారి, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. గురువారం ఆర్డీవో రాజేశ్వర్ గాంధీ నగర్‌లో సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా వేములవాడ అర్బన్ మండలంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయం పరిధి 19వ వార్డులో పైలట్ ప్రాజెక్టు కింద కుటుంబాల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. వార్డులోని ప్రతి ఇంటికి సిబ్బంది వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఎక్కడైనా అందుబాటులో లేకుంటే మరుసటి రోజు కూడా ఇంటికి వస్తారని ఆయన తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ సర్వే చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్, ఎంపీడీవో మలహోత్ర, నాయబ్ తహసీల్దార్ రజిత, వైస్‌చైర్మన్ బింగి మహేశ్, నాయకులు కొమురయ్య, పుల్కం రాజు, పులి రాంబాబు, తోట రాజు, శ్రీశైలం, పీర్ మొహమ్మద్ తదితరులు ఉన్నారు.



డిజిటల్ కార్డు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 3: విధి నిర్వహణలో అలసిపోయిన పోలీస్ సిబ్బందికి క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో గురవారం బెటాలియన్ ఇంటర్ కంపెనీస్, ఆన్యువల్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు శాంతి కపోతాలను ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కమాండెంట్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది తీరిక లేకుండా విధులను నిర్వహిస్తున్నారన్నారు. వారికి మానసికోల్లాసం కల్పించాలనే సంకల్పంతోనే క్రీడా పోటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం నుంచి ఆదివారం వరకు జరిగే క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్, జవాలెన్‌త్రో, షాట్‌పుట్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, లాంగ్‌జంప్, హై జంప్, ఐదు కిలోమీటర్ల రన్నింగ్, వంద మీటర్ల రన్నింగ్, క్యారం బోర్డు, చెస్, షటిల్, వాలీబాల్ లాంటి క్రీడలు ఉంటాయని వివరిం చారు. ఇందులో గెలుపొందిన వారికి ఆదివారం బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు సాంబశివరావు, రాందాసు, ఉదయభాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల, ఆర్ఐలు నారాయణ, శ్రీధర్‌న శ్రీనవాస్, సీహెచ్ నేమాజీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ బెటాలియన్‌లో పరుగు పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్

క్రికెట్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జట్టు ఫైనల్‌కు చేరింది. గురువారం సెమీ ఫైనల్‌లో నిజామాబాద్‌తో తలపడిన ఉమ్మడి జిల్లా జట్టు విశేష ప్రతిభ చాటి ఫైనల్‌కు చేరింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 46.3 ఓవర్లలో 165 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 32.3 ఓవర్లలో 102 పరుగులకు ఆల్ అవుట్ అయింది. కరీంనగర్ జట్టు నుంచి విగ్నేష్ 59 పరుగులు, ఈ తక్షిల్ 38 పరుగులు చేయగా విగ్నేష్ మూడు వికెట్లు, అన్వేష్, అశిష్‌రెడ్డి, రుత్విక్ చెరి రెండు వికెట్లు తీశారని జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు పి మనోహర్‌రావు తెలిపారు. జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎస్ మురళీధర్‌రావు, సంఘం సభ్యులు అజిత్‌కుమార్, విద్యాసాగర్ రావు, శ్రవణ్‌కుమార్ అభినందించారు.



పట్టణ పురవీధుల్లో హంస వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు



శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

రాజన్న క్షేత్రంలో

దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి క్షేత్రంలో దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఆలయాన్ని తీరొక్క పూలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతామూర్తులతో పాటుగా రాజరాజేశ్వరీ అమ్మవారికి లలితా సహస్రనామ సహిత చతుషష్టి పూజలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున రాజరాజేశ్వరీదేవి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట సూపరింటెండెంట్ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

● హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం అమ్మవారిని పెద్దసేవపై హంసవాహనంలో నిలిపి పట్టణ వీధులగుండా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని తరించారు. అమ్మవారి ఊరేగింపునకు ముందు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొని పెద్ద సేవలో పాల్గొన్నారు. రాజన్న ఆలయంలో ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సాంప్రదాయ దుస్తులను అందజేశారు.

ధర్మపురి, కొండగట్టులో..

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీనృసింహస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు భరత్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్ వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య కలశ స్థాపనలు, విశ్వక్సేన పూజలు, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. శివాలయంలో ఉదయం వేద బ్రాహ్మణులు, రుత్వికులచే మహా సంకల్పం, పృథ్వీ, కలశ, గణపతి పూజ, మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మ వారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం లక్ష్మీ నృసింహ స్వామి వారలను అశ్వ వాహనంపై పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో టీటీడీ కళ్యాణ మండపంలో, తిమ్మాపూర్ సీతా రామచంద్రస్వామి ఆలయంలో, ఒజ్జలవారి వీధిలో, నేరెళ్లలో నవరాత్రులు ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి క్షేత్రంలో శైలపుత్రి రూపంలో అమ్మవారు



కొండగట్టులో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొండగట్టులో మళ్లీ తలానీలాల టెండర్లు

- ● 17న నిర్వహణకు ఏర్పాట్లు
- ● తక్కువ వేలం రావడమే కారణం

మల్యాల, అక్టోబరు 3: కొండగట్టు ఆంజనేయ స్వామి పరిధిలో తలానీలాలు పోగు చేసుకునేందుకు మరోసారి టెండర్లు నిర్వహించనున్నారు. నాలుగోసారి సోమవారం నిర్వహించిన వేలం ప్రక్రియ దాదాపు ఖరారు అయ్యే క్రమంలో తక్కువ వేలం వచ్చిందని అధికారులు మరో సారి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో పలుమార్లు ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. మార్కెట్‌లో ధరలు లేవనే సాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్‌దారులు సోమవారం నిర్వహించిన వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ రూ.1.76కోట్లు హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించగా తక్కువ వేలం వచ్చిందని, రెండేళ్ల క్రితం రూ.3.64 కోట్లు పలికిన టెండర్ ప్రస్తుతం రెండు కోట్లు దాటకపోవడంతో మరో సారి నిర్వహించాలని కమిషనర్ ఆదేశించడంతో సోమవారం నాటి టెండర్‌ను రద్దు చేశారు. తలనీలాల టెండర్ పెరగకుండా తక్కువ ధరలు పలుకడానికి ఒక్క ప్రాంతం నుంచి టెండర్‌దారులు వస్తుండడమే కారణమని తెలుస్తుండడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 17న టెండర్లు నిర్వహించడానికి అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దేవస్థానం ఆధ్వర్యంలో గతంలో పోగు చేసిన తలనీలాలకు సైతం టెండర్ 17న నిర్వహించనున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

గణేశ్‌నగర్, అక్టోబరు 3: రాష్ట్ర అసోసియేషన్ నిర్ణయం మేరకు దసరా తర్వాత డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు శాత వాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ మేనేజ్‌మెంట్ అసోసియేష న్(సుప్మా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.వేంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్య దర్శి శ్రీపాద నరేష్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాలేదన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో కూడా ఉన్నత విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఫీజు బకాయిల గురించి ఎన్నిసార్లు మంత్రులు, అధికార్ల చుట్టూ తిరిగినా ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. దసరాలోపు ఫీజు బకాయిలు చెల్లించాలని కోరారు. బకాయిలపై ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు తెరవకూడదని నిర్ణయించామని తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు గురువారం 8,525 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,525 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, అక్టోబరు 3: జమ్మికుంట వ్యవసాయ మా ర్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 82క్విం టాళ్ల విడి పత్తి, 34మంది రైతులు 58క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

క్రైం కార్నర్

మృతదేహం కోసం గాలింపు

- సొంత బావే హంతకుడు?

కథలాపూర్, అక్టోబరు 3: మండలంలోని చింతకుంటకు చెందిన నేతుల మల్లేశ్ అదృశ్యమైన ఘటనలో మిస్టరీ వీడినట్లు తెలిసింది. సొంత బావే మరి కొందరితో కలిసి హతమార్చినట్టు పోలీసుల విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. మల్లేశ్‌ను చంపిన అనంతరం వరదకా లువలో మృతదేహాన్ని పడేసిన నేపథ్యంలో గురువారం ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో జాలర్లతో అన్వేషణ కొనసాగించారు. దుంపెట శివారు నుంచి తక్కళ్లపల్లి, దమ్మన్నపేట మీదుగా రాంపూర్ పంపు హౌజ్ దాకా జాలర్లతో వెతికినా ఫలితం లేకుండా పోయింది. వరద కాలువ పక్కన ఉన్న చెట్లకు ఎక్కడైనా తగిలి మృతదేహం నిలిచిపోయి ఉంటుందనే అనుమానంతో వెతికారు. మంగళవారం అర్ధరాత్రి మల్లేశ్‌తో కలిసి తన బావ మరి కొందరు మద్యం తాగగా అక్కడే మాటా మాటా పెరిగి ఇద్దరి మధ్య తోపులాట జరిగినట్టు తెలిసింది. అదే క్రమంలో పక్కనే ఉన్న వరద కాలువలో పడేసినట్టు మృతుడి బావ అంగీకరించాడని తెలుస్తోంది. మృతదేహం కోసం పోలీసులు వరద కాలువ ప్రవాహాన్ని తగ్గించి గాలింపు చేపట్టారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంలో ఈనెల 1న నన్నపునేని విద్యాసాగర్‌ను చంపిన తమ్ముడు నన్నపునేని విక్రమ్‌రాజ్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ విలేకర్ల సమావేశంలో హత్య వివరాలు వె ల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు విద్యాసాగర్, తమ్ముడు విక్రమ్‌రాజుకు కొన్ని రోజులుగా భూవివాదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భే తగాదాలను మనసులో పెట్టుకొని ఎలాగైనా విద్యాసాగర్‌ను అంతమొందించాలని విక్రమ్‌రాజు పథకం రూపొందించాడు. ఈక్రమంలో ఈనెల 1న తన ఇంటి సమీపంలో పాత పగలు మనసులో పెట్టుకొని వాగ్వివాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి విద్యాసాగర్ తలపై తమ్ముడు విక్ర మ్‌రాజు రోకలిబండతో బలంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై సధాకర్ తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టగా అంతర్గాం శివారులో నిందితుడు విక్రమ్‌రాజును మధ్యాహ్నం సమయంలో పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డిని, ఎస్సై సధాకర్‌ను, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రఘుచందర్ అభినందించారు.

ఆలయంలో చోరీ

- వెండి, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన దొంగలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 3: జగిత్యా ల రూరల్ మండలంలోని బాలపల్లి గ్రామంలో గల రాజరాజేశ్వర దేవాల యంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని కిలో వెండి నాగభరణం, అరతులం వెండి, అరతులం బంగారు చైన్ ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

గంభీరావుపేట, అక్టోబరు 3: గంభీరావుపేట మండలం బరిగెల గూడెం కాలనీకి చెందిన శనిగరపు జీవన్ (31) అనే యువకుడు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామ సమీపాన గల వ్యవసాయ బీడు భూమిలో చెటుకు ఉరి వేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జీవన్ గత కొంత కాలంగా షుగర్ వ్యాధిలో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. తరుచూ వ్యాధి తీవ్రతపై బాధపడుతూ జీవన్ ఇంట్లో చెప్పుకునేవాడు. వ్యాధి ప్రభావాన్ని తట్టుకోలేక నిత్యం మనస్తాపం చెందేవాడు. గురువారం ఉదయం టీ తాగి వస్తానని చెప్పి జీవన్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెతుకుతుండగా, గ్రామ సమీపాన ఉన్న ఓ బీడు భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవన్ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోల్‌సిటీ, అక్టోబరు 3: గోదావరిఖని గంగానగర్ గోదావరి వంతెన వద్ద గురువారం రేషన్ బియ్యం తరలిస్తున్న రెండు ఆటోలను రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గోదావరిఖని నుండి ఆటోలో మంచిర్యాల వైపునకు బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు జరిపారు. ఆటోలో ఉన్న 8.5క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనపర్చుకుని ఆటోలను సీజ్ చేశారు. బియ్యం తరలిస్తున్న తూర్పాటి ప్రకాష్, చింతల చిన్నలను అదుపులోకి తీసుకున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 3: రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బొమ్మకంటి అవినాష్(28) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బొమ్మకంటి రమ్య- రవీందర్ దంపతుల చిన్న కొడుకు అవినాష్ కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివసిస్తుండేవాడు. రెండు రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అక్కడి చుట్టు పక్కల వారు ఆసుపత్రికి తరలించి ఎల్లారెడ్డిపేటలోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులుగా చికిత్స పొందుతున్న అవినాష్ పరిస్థితి విషమించి గురు వారం చనిపోయాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వ హించారు. యువకుడు ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికంగా చర్చించుకుంటున్నారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్ పరామర్శించారు.



అవినాష్(ఫైల్)

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

ముత్తారం అక్టోబరు 3: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు వాగు వద్ద గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం కొట్టుకు వచ్చింది. గ్రామపంచాయతీ సెక్రెటరీ ఇచ్చిన సమాచాం మేరకు ఎస్సై గోపతి నరేష్ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరీక్షించారు. వృద్ధురాలి వయసు 50 నుంచి 65 సంవత్సరాల ఉంటుందని, పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండి ఒంటిపై ఎర్ర చీర, ఎర్ర జాకెట్టు ధరించి ఉందని, మృతదేహం గుర్తు పట్టలేకుండా ఉందన్నారు. పంచాయతీ సెక్రెటరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు

- రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ పట్టివేత
- 40క్వింటాళ్ల బియ్యం స్వాధీనం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోల్‌సిటీ, అక్టోబరు 3: 'దర్జాగా రేషన్ బియ్యం దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై పౌర సరఫరాలశాఖ స్పందించింది. గురువారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు గోదావరిఖనిలో దాడులు నిర్వహించారు. గోదావరిఖనిలో రేషన్ బియ్యం దందా చేస్తున్న కింగ్‌పిన్‌పై ఫోకస్ పెట్టారు. సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో బృందం నిఘా పెట్టిం ది. గురువారం సాయంత్రం గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లి రేషన్ బియ్యం అక్రమ రవాణాదారుల గోడౌన్‌ల నుంచి బియ్యం తరలిస్తుండగా వ్యాన్(టీఎస్22టీఏ1039)ను పట్టుకున్నారు. అందులో 84బస్తాల్లో ఉన్న 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. పౌరసరఫరాలశాఖ రామగుండం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్‌లో బియ్యం తరలిస్తున్న పాశం విక్రమ్‌పై కేసు నమోదు చేశారు.

● కాగా గోదావరిఖనిలో సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ దాడులు జరు గుతున్నాయనే సమాచారంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని రేషన్‌షాపులు మూసివేశారు. రేషన్ షాపుల్లో నుంచి నేరుగా అక్రమ రవాణాదారులకు బియ్య రవాణా జరుగుతుందనే సమా చారంతో టాస్క్‌ఫోర్స్ నిఘా పెట్టింది.

నలుగురు దొంగల అరెస్టు

- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, అక్టోబరు 3: కూలీ పనులు చేస్తూ వచ్చే సంపాదన సరిపోవడం లేదని భావించిన కొందరు ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేయ డమే వృత్తిగా ఎంచుకున్నారని, ఇందులో నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. దొంగలందరూ మంచిర్యాల జిల్లాకు చెందినవారని, కొన్ని సంవత్సరాల నుంచి వీరు ఆస్తి సంబంధిత నేరాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. రాత్రివేళలో తాళం వేసి ఉన్న ఇళ్లను, షాపులను ఎంచుకుని వాటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనాలు చేస్తున్నారని, వీరిలో గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని, కొందరు జైలుకు కూడా వెళ్లివచ్చారన్నారు. ఇలాంటి దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ వివరించారు. అరెస్టయిన వారిలో మంచిర్యాల జిల్లా మందమర్రికి యాపల్‌కు చెందిన పిట్టల సురేందర్, మందమర్రి విద్యానగర్‌కు చెందిన సిలివేరు శంకరయ్య, బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన గోషిక కార్తీక్, మందమర్రి చెత్లాపూర్‌కు చెందిన పసుపులేటి శ్రీనివాస్‌లు ఉన్నారు. వీరి ముఠాలోని గుర్రాల చిన్న భూమయ్య, రాము అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. గతనెల 23 అర్ధరాత్రి ప్రాంతంలో సుల్తానాబాద్‌లోని కరీంనగర్ రోడ్డులోగల శాస్త్రినగర్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో ఈ దొంగలు కిటికీ రాడ్స్‌ను కట్ చేసి లోపలికి వెళ్లి 300కిలోల కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడు గాయం నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తాము దర్యాప్తు చేయగా ఈ దొంగలు పట్టుబడ్డారని చెప్పారు. గురువారం ఉదయం ఇదివరకు దొంగతనం చేసి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో మళ్లీ దొంగతనానికి రాగా పోలీసులు వారిని పట్టుకుని విచారించగా దొంగలు అందరూ పట్టుబడ్డారని తెలిపారు. అయితే చోరీ చేసిన కాపర్ వైర్‌ను కొంత అమ్మి డబ్బులు పంచుకున్నారని, మిగతా కొంత వైర్ వీరి వద్ద ఉంచుకున్నారని, దొంగలు హైదరాబాద్‌లో విక్రయించిన రాము అనే వ్యక్తి వద్ద కూడా రాగి వైర్ రికవరీ చేశా మన్నారు. ఈ దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులతో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

శుభప్రదం.. అమ్మవారి దర్శనం

- శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం
- అమ్మవారి శోభాయాత్ర... విగ్రహ ప్రతిష్ఠాపనలు
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అలంకరణలతో మండపాల ఏర్పాటు


సిరిసిల్లలోని మండపంలో అమ్మవారు


ఇల్లంతకుంటలో పూజలు నిర్వహిస్తున్న యువకులు


కొలనూరులో దుర్గా మాతను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శరన్నవరాత్రోత్సవాలు మొదలయ్యాయి. భక్తులు అమ్మవారిని తమకిష్టమైన తొమ్మిది అవతారాల్లో అలంకరణలతో కొలుచుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రులు అత్యంత ఘనంగా గురువారం అరంభించుకున్నారు. జిల్లా కేంద్రంలో మండపాలను అందంగా అలంకరించుకోవడంతో పాటు అమ్మవారిని శోభాయాత్రగా మండపాల వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠించుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం, జిల్లాలోని వివిధ దేవాలయాల్లో ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు విజయదశమితో ముగియనున్నాయి. వేములవాడలో తొలిరోజు శైలపుత్రి అలంకర ణతో అమ్మవారు దర్శనమిచ్చారు. దసరా సరదాలే కాదు చైతన్యాన్ని కలిగించే పండుగ. హిందువులకు పండుగల్లో అతి ముఖ్యమైనదిగా తొమ్మిది రోజుల పాటు దేవి శరన్నవరాత్రులుగా కొలుచుకుంటారు. ఈ పండుగలో మొదటి మూడు రోజులు పార్వతీదేవికి, తర్వాత మూడురోజులు లక్ష్మీ దేవికి, ఆ తరువాత మూడు రోజులు సరస్వతికి పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మవారిని తొమ్మిది రూపాల్లో అలంకరించుకొని పూజలు చేస్తారు.

● నవదుర్గలుగా రాజరాజేశ్వరీ అమ్మవారు..

జిల్లాలో పల్లెలు, పట్టణాలతో పాటు వేములవాడలోని రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శరన్నవరాత్రుల్లో రాజరాజేశ్వరీ అమ్మవారు నవదుర్గల రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు గురువారం శైలపుత్రిగా దర్శనమివ్వగా రెండో రోజు బ్రహ్మచారిణిగా, మూడో రోజు చంద్రఘంట రూపంలో, నాలుగో రోజు కూష్మాండ అవతారంలో, ఐదో రోజు స్కందమాత రూపంలో, ఆరో రోజు కాత్యాయనిగా, ఏడో రోజు కాళరాత్రి రూపంలో, ఎనిమిదో రోజు మహాగౌరి అలంకారంలో, తొమ్మిదో రోజు సిద్ధిదా అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారు. దసరా రోజున మహాలక్ష్మి, పారువెల్లి రాజరాజేశ్వరదీదేవిగా పూజలందుకుంటారు. అమ్మవారి రూపాలైన మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతి, బాలాత్రిపురసుందరీదేవి, రాజరాజేశ్వరీ అమ్మవార్లలో ఒకరైన రాజరాజేశ్వరీ అమ్మవారు కొలువై ఉన్న క్షేత్రం కావడంతో శరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకతగా భావిస్తారు. ఆలయ ఆవరణలోనే బాలాత్రిపురసుందరీదేవి, ఆలయం వెనుకవైపు మహిషాసురమర్ధినీ అమ్మవారు కొలువై ఉన్నారు. దీంతో దుర్గాష్టమి రోజున మహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ నిర్వహిస్తారు.


ఎల్లారెడ్డిపేటలో దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/బోయినపల్లి/కోనరావుపేట/చందుర్తి/గంభీరావుపేట: జిల్లాలోని ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, బోయినపల్లి, కోనరావుపేట, చందుర్తి, గంభీరావుపేట మండలలాల్లో దేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రత్యేక పూజల అనంతరం దుర్గాదేవిని ప్రతిష్ఠించారు. తొలిరోజు బాలత్రిపురసుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి చేరుతున్న మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్

- ఆందోళనలో అనుపురం గ్రామ రైతులు



అనుపురం శివారులోకి వచ్చిన బ్యాక్ వాటర్, పొలంలోకి చేరిన నీటిని చూపుతున్న రైతు

వేములవాడ టౌన్, అక్టోబరు 3: మధ్యమానేరు బ్యాక్‌వాటర్ పంటపొలాల్లోకి చేరుతుండడంతో పొట్టకు వచ్చిన వరి చేను చేతికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామంలోని మిడ్‌మానేరు కోసం అధికారులు తీసుకున్న స్థలం పూర్తిగా మునిగిపోయాయి. బఫర్ జోన్ సైతం మునిగిపోయి పంటపొలాల్లోకి మిడ్‌మానేరు నీరు వచ్చి చేరిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంట భూముల్లోకి నీరు వచ్చే వరకు అధికారులు చూస్తు ఉన్నారని మండి పడ్డారు.

మధ్యమానేరు బఫర్ జోన్ పరిధి దాటి పంటపొలాల్లోకి వచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటపొలాల్లోకి నీరు వచ్చి చేరడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పంట పొలాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు ఎర్రం మహేష్ పరిశీలించారు. అనంతరం ఎర్రం మహేష్ మాట్లాడుతూ బఫర్ జోన్ దాటి రైతుల పంటపొలాల్లోకి నీరు వచ్చి చేరిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుని మిడ్ మానేరు నీటిని కిందకి వదలాలని డిమాండ్ చేశారు.

మన సంస్కృతికి నిదర్శనం 'బతుకమ్మ'

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 3: మన సంస్కృతికి సంప్రదాయాలకు బతుకమ్మపండుగ నిదర్శనమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సిరిసిల్ల మార్కెట్ కమిటి చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని వికాస్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన వారు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తు భావి తరాలకు తెలిసేలా యువతలో మన సాంస్కృతి సంప్రదాయల పట్ల అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

వేములవాడ, అక్టోబరు 3: దసరా అనంతరం డిగ్రీ కళాశాలలను నిరవధికంగా మూసి ఉంచాలని నిర్ణయించి నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా డిగ్రీ కళాశాలల సంఘం ఉపాధ్యక్షుడు అయాచితుల జితేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉన్నత విద్యను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేస్తోందన్నారు. ఫీజు బకాయిల గురించి ఎన్నిసార్లు మంత్రులు, అధికార్ల చుట్టూ తిరిగినా, ముఖ్యమంత్రిని కలుద్దామని ప్రయత్నించినా కనీసం సమయం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా లోపు ఫీజు బకాయిలు చెల్లించకుంటే శాతవాహన యూనివర్శిటీ పరిధిలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిండు కుండలా మిడ్ మానేరు


నీటితో కళకళలాడుతున్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్

బోయినపల్లి, అక్టోబరు 3: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. గురువారం సాయంత్రం సమయానికి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను 317.86 మీటర్లకు చేరుకుంది. నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 27.17 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట నీటి నిల్వ భారీగా పెరగడంతో బ్యాక్ వాటర్ పూర్తిస్థాయిలో విస్తరించింది.

విలీన గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 3: సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసిన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చాలని విలీన గ్రామాల ఐక్యవేదిక అధ్యక్షుడు, 10వ వార్డు చిన్నబోనాల కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామంలోని జేఏసీ అధ్వర్యంలో గురువారం గ్రామంలో మహిళా సంఘాల మహిళలతోపాటు గ్రామస్థులు, జేఏసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డు కార్యాలయం ఎదుట జేఏసీ అధ్వర్యంలో గ్రామస్థులు, నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ ఏడు గ్రామాలను సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనం చేసిన తరువాత గ్రామాల్లో కూలీలకు ఉపాధిహామీ పథకంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు దూరమైపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విప్ స్పందించి ఏడు గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సలేంద్రి బాలరాజుయాదవ్, పోచవేణి శ్రీనివాస్, బెజ్జారపు చందుగౌడ్, వంగ అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో దసరా పండుగ కొనుగోళ్లు

- కిటకిటలాడుతున్న షాపింగ్‌మాల్స్ - ఆఫర్లతో ప్రత్యేక ఆకర్షణ



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బతుకమ్మ, దసరా ఆఫర్ల సందడితో మార్కెట్ కిటకిటలాడుతోంది. ప్రజల్లో పండుగ జోష్ మొదలైంది. వ్యాపారస్తులు పండుగ సెంటిమెంట్‌లను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లు ఇస్తూ ఆకర్షిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన పట్టణాలుగా ఉన్న సిరిసిల్ల, వేములవాడలో షాపింగ్ సందడి జోరుగా కనిపిస్తోంది. రోడ్లపై ఎక్కడ చూసిన జనంతో మార్కెట్‌కే కొత్త శోభ వచ్చింది.

● వస్త్ర దుకాణాల్లో సందడి...

బతుకమ్మ, దసరా అనగానే ఇంటిల్లిపాది కొత్త బట్టలు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ధనిక, పేద తేడా లేకుండా ప్రతీ ఒక్కరు కొత్త బట్టలను కొనుగోలు చేయడం తప్పనిసరిగా భావిస్తారు. కొత్త బట్టలు కట్టుకొని కుటుంబ సభ్యులంతా ఒకచోటకు చేరుకొని దసరా పండుగ రోజు జమ్మి పంచుకుంటారు. బతుకమ్మ పండుగ రోజు తీరొక్క పూలతో పాటు రంగురంగుల చీరలతో మహిళలు ఆటాపాటలతో గడుపుతారు. దీంతో చీరల దుకాణాలే కాకుండా రెడిమెడ్ దుకాణాలు, కిడ్స్‌వేర్‌లు కళకళలాడుతున్నాయి. బట్టల దుకాణాల్లో కొందరూ వ్యాపారస్తులు రెండు వేల రూపాయల నుంచి ఆపైగా కొనుగోలు చేసిన వారికి వెండి నాణెలా, వివిధ వస్తువులు బహుమతులుగా అందిస్తున్నారు.

● ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాల జోరు...

గృహాల్లో అవసరమయ్యే వస్తువుల కొనుగోళ్లు కూడా పండుగ రెండు రోజులే ఉండడంతో టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్‌మిషన్లు, సెల్‌ఫోన్ల కొనుగోళ్లు పెరిగాయి. వివిధ కంపెనీలు తక్కువ ధరలకు వివిధ వస్తువులను అందిస్తుండగా కొనుగోళ్లపై స్క్రాచ్ కార్డులు, వివిధ వస్తువులు బహుమతులుగా అందిస్తున్నారు. ఎల్ఈడీ టీవీలకు పెన్‌డ్రైవ్‌లు, హోం థియేటర్లు ఆఫర్లుగా ఇస్తున్నారు. ఎటు చూసినా సందడి సందడిగా జిల్లా కేంద్రం మారింది.

జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు


మాట్లాడుతున్న కరీంనగర్ సీపీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 3 : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో రాజన్న జోన్-3 (కరీంనగర్, మెదక్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి) స్థాయిలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి గురువారం వివిధ విభాగాల్లో కమీషనరేట్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ ఎంపిక కోసం కమిషనరేట్‌లు, జిల్లాల వారీగా పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోటీల్లో ముఖ్యంగా ఫోరెన్సిక్ సైన్స్, క్రైం ఇన్వెస్టిగేషన్, చట్టాలు, మెడికో లీగల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్, క్రైం సీన్ ఫొటోగ్ర ఫీ, వీడియోగ్రఫీ, క్రైం సీన్ పరిశీలనలో భాగంగా వాహనాల చెకింగ్ , గ్రౌండ్ తనిఖీ, రూమ్ తనిఖీ, యాక్సిస్ కంట్రోల్‌లో నైపుణ్యం, కంప్యూటర్ పై అవగాహన, డాగ్ స్క్వాడ్‌లో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజి వ్, నార్కోటిక్ విభాగాల్లో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో జోనల్ స్థాయి తర్వాత రాష్ట్ర స్థాయిలో మళ్లీ పోటీలు నిర్వహించేందుకు ఎంపిక లు ఉంటాయని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి శిక్షణ అనంతరం ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం పొందుతారని తెలిపారు. ఈ డ్యూటీ మీట్ పోటీల్లో కమిషనరేట్‌లోని అన్ని విభాగాలు, డివిజన్‌ల నుంచి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య శిబిరం


మాట్లాడుతున్న కార్యదర్శి రాధికా జైస్వాల్

సిరిసిల్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని విశ్రాంత ఉద్యోగుల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మానేరు స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా విశ్రాంత భవనంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ ప్రారంభించారు. డాక్టర్ జైల్ సింగ్, డాక్టర్ రమేష్, డాక్టర్ యాదగిరి గౌడ్ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్, న్యాయవాది అడెపు వేణు, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, డిప్యూటీ ఎల్ఏడీసీఎస్ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీని విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 3: పట్టణంతోపాటు టెక్స్‌టైల్ పార్క్ పనిచేసిన మరమగ్గాల కార్మికులు తయారుచేసిన బతుకమ్మ చీరలకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ అధ్వర్యంలో కార్మికులతో కలిసి గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ సంవత్సర కాలంగా బతుకమ్మ చీరల తయారీని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. మరమగ్గాల పరిశ్రమలపై ఆధారపడిన కార్మికులు ప్రస్తుతం పనులు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు రావలసిన పది శాతం యారన్ సబ్సిడీ వెంటనే విడుదల చేయాలని చేనేత జౌళీశాఖ ఏడీ మిట్టకోల సాగర్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేష్, ఎగమంటి ఎల్లారెడ్డి, నక్క దేవదాస్, ఎలిగేటి రాజశేఖర్, కూచన శంకర్, బెజుగం సురేష్, మూషం శంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాల్లో జిల్లా ముందంజలో ఉండాలి

సిరిసిల్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర అరోగ్య పథకాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాను ముందు వరుసలో ఉంచాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం వసంతరావు మార్గనిర్దేశనం చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రాథమిక అరోగ్య కేంద్రాల వారీగా లక్ష్యాలను సమీక్షించారు. లక్ష్యాలను సాధించడంతో మిషన్‌మోడ్‌లో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, అంజలి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

తంగళ్లపల్లి, అక్టోబరు 3: రాష్ట్రంలో మత్స్య రంగం మీద ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులందరూ ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మత్స్య సహకార సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యరంగం అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మత్స్యకారులందరూ ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచంద్రం, ప్రకృతి పర్యావరణ సంస్థ అధ్యక్షులు మాదవరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, మత్స్య సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా మత్స్య సహకార సంఘం వైస్ చైర్మన్ శేఖర్, డైరెక్టర్ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు మంత్రి సురేఖ క్షమాపణ చెప్పాలి


రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 3: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండ సురేఖ భేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణ మహిళ విభాగం ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండ సురేఖ ప్లెక్సీని దహనం చేయడానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ మహిళ విభాగం పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజ, మహిళ కౌన్సిలర్లు, మహిళలు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు ప్లెక్సీని దహనం చేయకుండా అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరువర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహిళ చేతి గాజులు పగిలి గాయాలయ్యాయి. పోలీసుల తీరుపట్ల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి ప్లాకార్డులతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ మహిళ విభాగం అధ్యక్షురాలు బత్తుల వనిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను మంత్రి పదవిలో ఉన్న కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దిడ్డి మాదవి, గడ్డం లత, బీఆర్‌ఎస్ మహిళ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఎస్సీలనే నియమించాలి

సిరిసల్ల కలెక్టరేట్, అక్టోబరు 3: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్ అభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మిని కలిసి విద్యార్థి, ప్రజా, దళిత సంఘాల ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా (కేవీపీస్) కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డైరెక్టర్, మిగతా పోస్టులను ఎస్సీ సామాజికవర్గానికి కాకుండా ఇతర వర్గాలకు కేటాయిస్తున్నారన్నారు. డైరెక్టర్‌గా ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారం ప్రశాంత్, అంబేద్కర్ సంఘం నాయకులు మాసం సుమన్, మధు, అజయ్, విక్రం, రంజిత్, తదితరులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి, అక్టోబరు 3: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 9న నిర్వహిస్తున్న సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సెస్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. వేములవాడ సబ్‌డివిజన్ పరిధిలో చందుర్తి, కోనరావుపేట, వేములవాడటౌన్, వేములవాడరూరల్, వేములవాడ అర్బన్, బోయిన్‌పల్లి, రుద్రంగి, మండలాలకు చెందిన సెస్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారులు హాజరై సమస్యలను పర్కిరించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి, అక్టోబరు 3: రుద్రంగి మండలంలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతులు ఉన్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు సెస్ ఏఈ మహేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చందుర్తి మండలంలోని మల్యాల, చెరువుకుంటపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

గంభీరావుపేట: మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పిలుపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. వయోవృద్ధులు బాగోగులు ఎప్పటికప్పుడు పట్టించుకుంటూ వారికి న్యాయం చేయాలనే ఈ అసోషియేషన్ ప్రధాన లక్ష్యమని వారు వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, జిల్లా కార్యదర్శి శంకరయ్య, మండల అధ్యక్షుడు బార ధన్‌రాజ్, సభ్యులు సిద్ది రాములు, రాజయ్య, రాజనర్సు తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మారుమూల గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో వీపీఎల్ సీజన్-2 క్రికెట్ లీగ్‌ను గురువారం నాయకులతో కలిసి ప్రారంభించారు.

ఎల్లారెడ్డిపేట: ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి రాపోలు మాధవ్ 1527 ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందాడని స్థానికులు తెలిపారు. విద్యార్థి సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

- ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ తాజా, మాజీ ఎంపీటీసీ వర్ధ బాబు తండ్రి కాశయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయనను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, బాలరాజుయాదవ్, నర్సింహారెడ్డి, రాజునాయక్, సీత్యానాయక్, సురేశ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మల్లికార్జున కురుమ సంఘం అధ్యక్షుడిగా ఎగుర్ల కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని మల్లికార్జున కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఒగ్గు కుంటయ్య, ప్రధాన కార్యదర్శిగా బోడపట్ల అంజయ్య, కోశాధికారిగా దయ్యాల రాములు, కార్యదర్శిగా కాకల మల్లేశం, ముఖ్య సలహాదారులుగా గుంటి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చందుర్తి: మండలంలోని సనుగుల గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా జవ్వాజి నాగరాజు గురువారం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా యాస సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా బొల్లిపల్లి మధు, శనిగారపు స్వామి, కోశాధికారిగా మోకానపల్లి మల్లేశం, సలహాదారులుగా బొంత సురేందర్ రావు, అశోక్ రావు, రాదారపు రాజు, మల్లేశం, కొమురయ్య, అంజయ్య, నేరెళ్ల పర్సయ్య, మోకనపల్లి సురేష్ తదితరులు ఎన్నికయ్యారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు గ్రామంలోని డప్పు కళాకారులకు డప్పులను అందజేశారు. గ్రామంలోని 24 మంది డప్పు కళాకారులకు గ్రామ శాఖ అధ్యక్షుడు పెంతల శ్రీనివాస్ అందజేశారు.

ముస్తాబాద్: సిరిసిల్లా బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన అరేటి బ్రహ్మచారిని స్టడి సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి అధ్వర్యంలో సన్మానం చేశారు. డీఎస్సీ బయోలజికల్ సైన్స్‌లో జిల్లాలో 4వ ర్యాంకు సాధించిన సందర్భంగా బ్రహ్మచారిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ స్టడి సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయిలో డీఎస్సీ 2024లో మొదటి ర్యాంకులు సాధించిన అభ్యర్థులను గురువారం టీఆర్టీఎఫ్ జిల్లా నాయకులు అభినందించారు. డీఎస్సీ ఫలితాలల్లో భౌతిక శాస్త్రంలో మొదటి ర్యాంకును సాధించిన నామ్ శ్రీలత, సాంఘిక శాస్త్రంలో మొదటి ర్యాంకులను సాధించిన రాజారం జీవన్‌సాయిలను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫేడరేషన్ జిల్లా అధ్యక్షుడు బుర్రకృష్ణ ప్రసాద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, నాయకులు భరత్‌నాయక్, గుగులోత్ రమేష్‌నాయక్, కనకయ్య, మచ్చ అనంద్ అభినందించారు.

చందుర్తి: మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ సంఘంలో బీజేపీ సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల సభ్యత్వ నమోదు కన్వీనర్ చిర్రం తిరుపతి గురువారం తెలిపారు. భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 11గంటలకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

చందుర్తి (రుద్రంగి): రుద్రంగి మండల కేంద్రంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు మాజీ ప్రజా ప్రతినిధులు గురువారం పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు 1,65,000 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు గట్ల మీనయ్య, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, గండి నారాయణ, పల్లి గంగాధర్, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్, ఇప్ప మహేష్, సూర యాదయ్య పాల్గొన్నారు.

- మండల కేంద్రంలో సెస్ అధికారులతో కలిసి రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మొబైల్ ద్వారా విద్యుత్ బిల్లింగ్ కొట్టడాన్ని గురువారం ప్రారంభించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా వినియోగదారులకు కరెంట్ బిల్ వస్తుందన్నారు.